ప్రజలే వైఎస్సార్‌సీపీకి స్టార్ క్యాంపెయినర్లు

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్టార్ క్యాంపెయినర్లని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. గురువారం స్థానిక 40వ డివిజన్ మరియాపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా అర్హులెవరికైనా పథకాలు అందలేదా అని ఆరా తీశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంతకంతో కూడిన బుక్‌లెట్‌ను వారికి అందజేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఎంతో శ్రమపడి ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్నం నీళ్లు లేకుండా ఎదురుచూస్తేగానీ పింఛన్ దక్కేది కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అవ్వాతాతలు ఇంట్లోంచి అడుగు బయట పెట్టకుండానే సూర్యోదయం కాకమునుపే ప్రతినెలా ఒకటోతేది తలుపుతట్టి పింఛన్ అందించడం జరుగుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం కాబట్టే ప్రజల ముందుకు వెళ్లి మా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ధైర్యంగా అడుగుతున్నామన్నారు. ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి రాష్ట్రంలోని అన్ని పార్టీలు ఒక్కటై కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయన్నారు. ఇప్పుడున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, హరూన్ గ్రూప్ ఎండీ అహమ్మద్‌బాషా, 40వ డివిజన్ కార్పొరేటర్ ఆర్. బాలస్వామిరెడ్డి, పార్టీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్యయాదవ్, తోటక్రిష్ణ, షఫీ, పస్తం అంజి, మునిశేఖర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, మియ్యా, కో ఆప్షన్ సభ్యురాలు బండి మరియలు పాల్గొన్నారు.


'గడప గడపకు మన ప్రభుత్వం'లో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

విజ్ఞాన దాత బాలయేసు

కడప కల్చరల్ : బాలయేసు విజ్ఞాన దాతగా అనేక అంశాలలో ఏర్పడిన సమస్యలకు పరిష్కారం చూపారని చెన్నూరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ లక్కినేని పీటర్ ప్రభాకర్ అన్నారు. కడప నగరం మాసాపేటలోని సెయింట్ జాన్స్ చర్చిలో గురువారం అద్భుత బాలయేసు మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రార్థనా సమయంలో ఆయన విచారణ గురువులు గుడిమెె దేవసహాయం ఆధ్వర్యంలో పవిత్రాత్మ స్వస్థల కూటమి దివ్య బలిపూజ, దైవ వాక్య ప్రసంగాలు నిర్వహించారు. అనంతరం జరిగిన పవిత్రాత్మ స్వస్థత ప్రార్థనల్లో భాగంగా వ్యాధిగ్రస్తులు, యువత, బాలల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఏసు వరప్రసాద్, జేఎంజే సిస్టర్లు, విచారణ కమిటీ పెద్దలు జయరాజు, చిన్నప్ప, విజయకుమారి, రామకృష్ణారెడ్డి, క్రిస్టఫర్, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, జ్యోత జార్జి, చిన్నకుమారి, కథోలిక విశ్వాసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


దైవ సందేశం అందజేస్తున్న గురువులు

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు నగర పురవీధుల మీదుగా కోటిరెడ్డి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ కేడెట్స్ ర్యాలీలో పాల్గొని ఓటరు ప్రతిజ్ఞ చేశారు. నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కళాశాలలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రధానమంత్రి ఓటరు దినోత్సవం సందర్భంగా మాట్లాడిన అంశాలను లైవ్‌లో తిలకించారు.

ఓటు విలువ గొప్పది

వైవీయూ : ఓటుకు అత్యంత విలువ ఉందని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ ఆచార్య ఎస్ రఘునాథరెడ్డి అన్నారు. జాతీయ సేవా పథకం యూనిట్-9 డాక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలం శివాజీ నగర్ గ్రామంలో ప్రజలకు ఓటు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వైవీయు సమన్వయకర్త డాక్టర్ ఎన్ వెంకట్రామిరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.


వైవీయూ: ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు, ఎన్‌సీసీ కేడెట్స్

సీనియర్ ఓటర్‌కు సత్కారం

కడప ఎడ్యుకేషన్ : జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకుని గురువారం కొండ పాలకొండయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్ నాగయ్యను సత్కరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు, ట్రస్టు చైర్మెన్ కొండా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా విధులను నిర్వహించాలి

కడప అర్బన్ : ఎన్నికల సమయంలో పకడ్బందీగా విధులను నిర్వహించాలని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ పోలీసు అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. కడప డీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద వున్న 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్'హాల్‌లో కడప అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో వుండే పోలీస్ స్టేషన్ సిబ్బందికి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ గురించి ఎన్నికలలో విధులు ఏవిధంగా నిర్వర్తించాలి? ఎన్నికలలో పోలీసులు ఎదుర్కొనే సమస్యలు, వాటిని చట్టపరంగా ఎలా పరిష్కరించాలి? ఓటర్లను ఎలా చైతన్య పరచాలి? ఓటర్లను ప్రలోభపెట్టేవారిని ఎలా నియంత్రించాలి అనే అంశాలపై డీఎస్పీ వివరించారు. సీఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కడప ఒన్‌టౌన్, టూటౌన్, చిన్న చౌక్, కడప తాలూకా, రిమ్స్ పిఎస్ పోలీస్‌స్టేషన్‌ల నుంచి సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కడప డీఎస్పీ షరీఫ్

రాజీవ్ పార్కులో మరమ్మతులు చేయించాలి

కడప కార్పొరేషన్ : రాజీవ్ పార్కులో జన సందర్శన ఎక్కువైనందు వల్ల దెబ్బతిన్న ఆట వస్తువులను వెంటనే మరమ్మతులు చేయించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఈటింగ్ స్ట్రీట్, భగత్ సింగ్ నగర్ పార్క్, రాజీవ్ పార్కులను ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భగత్ సింగ్ పార్క్‌లో పైప్ లైన్ల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పార్కులో మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్క్‌లో పచ్చని మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ విభాగ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, డీఈ వేణుగోపాల్, ఏఈ మణిగోపాల్‌రెడ్డి, హార్టీకల్చర్ ఏడీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.


రాజీవ్ పార్కులో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్

వారసత్వ కళలను రక్షించుకుందాం

కడప కల్చరల్ : భారతీయ వారసత్వ సంపదను భావితరాల కోసం రక్షించుకుందామని బీసీ సంక్షేమశాఖ అధికారి వల్లూరు బ్రహ్మయ్య తెలిపారు. జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సంస్థ కార్యాలయంలో జిల్లా పర్యాటక ప్రాంతాల విశేషాలపై సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 250 సంవత్సరాల క్రితం నాటి దేవాలయ సంప్రదాయ నృత్యానికి సంబంధించిన ఫోటోను కడప ఇంటాక్ ద్వారా సేకరించారు. దానిని డాక్టర్ బ్రహ్మయ్య ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం మహిళా విభాగం ప్రతినిధి అసంతమ్మ, ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తదితరులు జిల్లా తూర్పు పర్యాటక ప్రాంతాల బ్రోచర్లను విడుదల చేశారు. ఇంటాక్ సభ్యులు గునిశెట్టి శ్రీనివాసులు, పద్మప్రియ చంద్రారెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు, రాఘవేంద్రవర్మ తదితరులు మాట్లాడారు.


పురాతన చిత్రం బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న అతిథులు

వైద్యం వెంకటేశ్వరాచార్యులకు 'భూతపురి' పురస్కారం

కడప కల్చరల్ : శతావధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ 22వ స్మారక సాహిత్య పురస్కారానికి కవి, విమర్శకులు, పరిశోధకులు, వ్యాఖ్యాత వైద్యం వెంకటేశ్వరాచార్యులను ఎంపిక చేశామని భూతపురి సుబ్రమణ్యశర్మ స్మారక ట్రస్టు కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్రశర్మ, అధ్యక్షులు భూతపురి గోపాలకృష్ణశాస్త్రి తెలిపారు. ఫిబ్రవరి 25న అల్లసాని పెద్దన సాహితీపీఠంతో కలిసి సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో భూతపురి 87వ జయంతి సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేస్తామన్నారు.

వైద్యం వెంకటేశ్వరాచారి అనేక పద్య, విమర్శనా గ్రంథాలు, కావ్య పరిష్కారాలు, వ్యాఖ్యానాలు వెలువరించారని తెలిపారు.

పర్యాటక బహుమతి ప్రదానం

కడప కల్చరల్ : జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల ట్రావెల్ యానియాక్ సంస్థ ఆన్‌లైన్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యాటక రంగానికి సంబంధించి వ్యాసరచన, రీల్ మేకింగ్‌లలో పోటీ నిర్వహించింది. నగరానికి చెందిన ఎస్‌కేఆర్‌అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల బీకాం మూడవ సంవత్సరం విద్యార్థిని సబీహా సుల్తాన ఈ పోటీల్లో మొదటిస్థానం సాధించింది. నిర్వాహకులు పంపిన రూ. 5 వేల నగదు, ప్రశంసాపత్రాన్ని గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం బాష విద్యార్థికి అందజేశారు.


సబీహ సుల్తానకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ సలీంబాష

విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి

చెన్నూరు : విద్య, వైద్యం, వ్యవసాయం, పాడి పరిశ్రమపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని కొండపేటలో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, వైఎస్సార్ పాలకేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు సుభిక్షంగా ఉంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్న లక్ష్యంతోనే ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులకు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసిందన్నారు. రెండు వేల జనాభా కలిగిన గ్రామాలలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినికల్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కొండపేటలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి

వైవీయూ : విద్యార్థులను చదువుతో పాటు నైపుణ్యాల్లోనూ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని నోడల్ రీసోర్స్ సెంటర్‌లో 'సెల్ఫ్ డైరెక్టెడ్ ఎమోషనల్ లెర్నింగ్, ఫార్ ఎంపతీ అండ్ కైండ్‌నెస్/సోషల్ ఎమోషనల్ లెర్నింగ్' అన్న అంశంపై డిగ్రీ కళాశాల అధ్యాపకులకు వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌సీ కోఆర్డినేటర్ డా. ఎం.వి. రమణయ్య, మాస్టర్ ట్రైనర్స్ యుగవాణి, నాగేంద్ర, సుబ్బారెడ్డి, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

29న పెన్షనర్స్ ధర్నా

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర సంఘం పిలుపు మేరకు స్థానిక కలెక్టరేట్ ఎదుట ఈనెల 29న ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి తెలిపారు. ఈ విషయమై గురువారం కడపలోని పెన్షనర్ల కార్యాలయంలో జాక్టో, ఉపాధ్యాయ, ఎన్‌జీవో సంఘ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించారు. ఎన్‌జిఓ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు లెక్కల జమాల్‌రెడ్డి, తిరుపాల్, రాజు, రమణారెడ్డి మాధవరెడ్డి, పుసుపులేటి శ్రీనివాసులు మాట్లాడారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

చింతకొమ్మదిన్నె : కడప - రాయచోటి ప్రధాన రహదారిలోని చెక్‌పోస్టు వద్ద గురువారం సీకే దిన్నె ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 22 బ్రీజర్ బాటిళ్లతోపాటు రెండు మ్యాన్షన్ హౌస్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


మోతాదుకు మించి ఎరువులు వాడరాదు

కమలాపురం : వరి పంటలో మోతాదుకు మించి ఎరువులు వాడటంతోనే పంటలు ఎండుతున్నాయని కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస ఆచారి, జాన్సన్ తెలిపారు. మండలంలోని గంగవరం, పుట్లంపల్లె గ్రామాల్లోని వరి పంటలను వారు పరిశీలించారు. నారు నాటిన నెల రోజుల వరి పైరు అక్కడక్కడ ఎండిపోతోందని రైతులు ఫిర్యాదు చేయడంతో శాస్త్రవేత్తలు స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డితో కలసి పరిశీలించి మాట్లాడారు. భాస్వరం ఎరువులు అధికంగా వాడటం వలన తగిన మోతాదులో ఎరువులు వేసినప్పటికి వరి పంటకు కావాల్సిన పోషకాలు అందక పంట ఎండిపోతోందని వారు రైతులకు సూచించారు. ముఖ్యంగా పైరులో ఎక్కువ రోజులుగా నిల్వ ఉన్న నీటిని తొలగించి తిరిగి మంచి నీరు పట్టాలన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, వీఏఏలు వెంకట కృష్ణ, ఇందిర, పుల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రయాణంలో యువత జాగ్రత్తలు పాటించాలి

చెన్నూరు : ప్రయాణం చేసేటప్పుడు యువత జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని అలాగే హెల్మెట్, కారు నడిపేటప్పుడు సీటు బెల్ట్ ధరించాలని రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు హెడ్ మదన్మోహన్ తెలిపారు. 35వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా గురువారం చెన్నూరులో ని రాజరాజేశ్వరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆర్‌ఈపీఎల్ వారి సహకారంతో రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఆపరేషన్ హెడ్ అరుణ్‌రాజ్, రూట్ మేనేజర్ కొండలరావు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలో చేరిక


పార్టీలో చేరుతున్న వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మహేంద్రారెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని అడవిచెర్లోపల్లెలో గురువారం జేసీఎస్ కన్వీనర్ మహేంద్రారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 7 కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీలో చేరాయి. బేరి లక్షుమయ్య, విజయ్‌భాస్కర్, జోషప్, రామన్న, రాజు, రాజశేఖర్, దానంలతో పాటు మరికొంత మంది పార్టీలో చేరారు. వీరందరికి మహేంద్రారెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మాజీ సర్పంచు సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పౌర్ణమి పూజలు

కడప కల్చరల్ : పౌర్ణమి సందర్భంగా గురువారం నగరంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తులతో ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహింపజేశారు.

- శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ యాగశాలలో భక్తులు చండీహోమాన్ని నిర్వహించారు. సాయంత్రం 108 మంది ముత్తయిదువులు ఆలయ ప్రాంగణంలో 108 దీపాలను వెలిగించి అష్టోత్తర శత దీపాలంకార సేవ నిర్వహించారు. పల్లకీ సేవ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఉరుసు


ప్రార్థనల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం తదితరులు

కడప కల్చరల్ : స్థానిక రవీంద్రనగర్‌లోని హుజారా మసీదులో గురువారం అస్తానె హజరత్ సయ్యద్‌షా గౌస్ షర్మాద్ ఖాద్రి 185వ ఉరుసు ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్ బాష ముస్లిం మత గురువులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీఠాధిపతి సయ్యద్ షా ఇలియాస్‌బాష ఖాద్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థిస్తున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉరుసు, అన్నదానం ఉంటుందన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు తనిఖీ


పరీక్షలను తనిఖీ చేస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ప్రీ పీహెచ్‌డీ పరీక్షలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం కేంద్ర గ్రంథాలయ భవనంలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని వీసీ తనిఖీ చేసి విద్యార్థుల హాల్‌టికెట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లు, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు.

ఐదోసారి.. ఉత్తమ అధికారి


అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి వరుసగా ఐదవ ఏడాది కూడా జిల్లా ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. శుక్రవారం రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ విజయరామరాజు చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంలో కీలక పాత్ర పోషిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు


మొక్క నాటి నీరు పోస్తున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి పరిరక్షణకు చర్యలు చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. స్వచ్ఛతా పక్వాడా-2024 కార్యక్రమంలో ఏపీజీబీ చైర్మన్ బ్యాంకు అధికారులతో కలిసి నగరంలోని ఐటీఐ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రత్నరాజు, అధ్యాపకులు, ఏపీజీబీ సిబ్బంది పాల్గొన్నారు.

28న చిల్డ్రన్ హోం ప్రారంభం

కడప కల్చరల్ : ఈనెల 28న బాసట చిల్డ్రన్ హోంను ప్రారంభిస్తున్నామని సంస్థ నిర్వాహకులు మేరువ బాలాజీరావు తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయి చదువుకు దూరంగా ఉన్న బాలలకు సరైన వసతులు కల్పించి విలువలతో కూడిన విద్యను అందించేందుకు ఈ హోంను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ హోం కడప నగరం ఎన్జీఓ కాలనీలో నిర్వహిస్తున్నామని వివరించారు. హోంలో చేరే అవసరమున్న విద్యార్థుల గురించి తమకు 98494 89206, 81420 47682 నెంబర్లలో సమాచారం ఇవ్వాలని కోరారు.